సాక్షి కామారెడ్డి

శనివారం । 22 । జూన్ । 2024



సంపదను పరిరక్షించాలి

అటవీ సంపదను పరిరక్షించాలని ఎల్లారెడ్డి ఎమ్మెల్యే మదన్‌మోహన్‌రావు అటవీ అధికారులను ఆదేశించారు.

- 8లో ▸



అప్రమత్తంగా ఉండాలి

సీజనల్ వ్యాధులు ప్రబలకుండా అధికారులు చర్యలు చేపట్టాలని జుక్కల్ ఎమ్మెల్యే లక్ష్మీకాంతారావు సూచించారు.

- 9లో ▸

గరిష్టం/కనిష్టం
38.3 /24.1

వాతావరణం

ఆకాశం పాక్షికంగా మేఘావృతమవుతుంది. అడపాదడపా జల్లులతోపాటు అక్కడక్కడ భారీ వర్షం కురిసే అవకాశాలున్నాయి.

న్యూస్‌రీల్

26 లోగా పనులు పూర్తి చేయాలి



నిజాంసాగర్: ప్రభుత్వ పాఠశాలల్లో చేపడుతున్న అమ్మ ఆదర్శ పనులను ఈనెల 26లోగా పూర్తి చేయాలని అదనపు కలెక్టర్ శ్రీనివాస్‌రెడ్డి సూచించారు. నిజాంసాగర్‌లోని ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో కొనసాగుతున్న పనులను ఆయన శుక్రవారం పరిశీలించారు. ప్రభుత్వ పాఠశాలల్లో విద్య అభ్యున్నతి కోసం అమ్మ ఆదర్శ కమిటీలు బాధ్యతాయుతంగా పని చేయాలన్నారు. జిల్లా పంచాయతీ అధికారి శ్రీనివాస్, ఎంపీడీవో గంగాధర్, తహసీల్దార్ భిక్షపతి, ఎంపీవో యాదగిరి, పాఠశాల హెచ్‌ఎం బాలచందర్ పాల్గొన్నారు.

'సీపీఎస్‌ను రద్దు చేయాలి'




కామారెడ్డి అర్బన్: కాంట్రిబ్యూటరీ పెన్షన్ స్కీం(సీపీఎస్)ను రద్దు చేసి పాత పెన్షన్ విధానాన్ని పునరుద్ధరించాలని టీఎన్జీవోస్ జిల్లా అధ్యక్షుడు నరాల వెంకట్‌రెడ్డి డిమాండ్ చేశారు. శుక్రవారం టీఎన్జీవోస్ కార్యాలయంలో జిల్లా కార్యవర్గ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎంప్లాయీస్ హెల్త్ స్కీంను అమలు చేయాలన్నారు. 317 జీవో ద్వారా వివిధ జిల్లాలకు బదిలీపై వెళ్లి, కుటుంబాలకు దూరంగా ఉంటున్న ఉద్యోగుల సమస్యలను పరిష్కరించాలని డిమాండ్ చేశారు. కేంద్ర సంఘం తోడ్పాటుతో పీఆర్సీ సాధనకు కృషి చేయాలని తీర్మానించారు. సమావేశంలో టీఎన్జీవోస్ కేంద్ర సంఘం కార్యదర్శి ఎం.నాగరాజు, కోశాధికారి ఎం.దేవరాజు, సంఘం జిల్లా కార్యదర్శి బొమ్మని సాయిలు, ప్రతినిధులు చక్రధర్, సాయిలు, శ్రవణ్, పోచయ్య, రాజేశ్వర్, రాజ్యలక్ష్మి, సంతోష్‌కుమార్, రాజ్‌కుమార్, శ్రీకాంత్, బాన్సువాడ, కామారెడ్డి, వెంకట్, శ్రీనివాస్‌రెడ్డి, శివకుమార్, జుగల్‌కిషోర్, భూపాల్ తదితరులు పాల్గొన్నారు.

రైల్వేస్టేషన్‌లో బాలుడి అదృశ్యం



ఖలీల్‌వాడి : నిజామాబాద్ రైల్వే స్టేషన్‌లో ఓ బాలుడు అదృశ్యమైనట్లు రైల్వే ఎస్సై సాయిరెడ్డి శుక్రవారం తెలిపారు. వివరాలు.. మదనపల్లి గ్రామానికి చెందిన ధనేవాడ పింకీ, లక్ష్మణ్ దంపతులు గురువారం రాత్రి తమ కుమారుడు మహేందర్(02)తో కలిసి రైల్వే స్టేషన్‌కు వచ్చారు. రాత్రి స్టేషన్‌లో పడుకున్నారు. ఉదయం లేచేసరికి బాబు కనిపించలేదు. రైల్వేస్టేషన్‌లో, బయట వెతికినా దొరకలేదు. దీంతో వారు పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఈ మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్సై తెలిపారు. బాలుడి ఆచూకీ తెలిస్తే 8712658591 నంబర్‌కు ఫోన్ చేయాలని సూచించారు.

బీఆర్‌ఎస్‌కు మూకుమ్మడి రాజీనామాలు



వర్ని: బాన్సువాడ ఎమ్మెల్యే పోచారం శ్రీనివాస్‌రెడ్డి శుక్రవారం కాంగ్రెస్‌లో చేరడంతో ఆయన అనుచరులు, మద్దతుదారులైన ప్రజాప్రతినిధులు ఉమ్మడి వర్ని మండలంలో ముకుమ్మడిగా రాజీనామాలు చేశారు. మోస్రా ఎంపీపీ పిట్ల ఉమా శ్రీరాములుతో పాటు ఇద్దరు ఎంపీటీసీలు, ఇద్దరు సొసైటీ చైర్మన్లు, బీఆర్‌ఎస్ అధ్యక్ష కార్యదర్శులతో పాటు వివిధ గ్రామాల బీఆర్‌ఎస్ నాయకులు పార్టీకి రాజీనామా చేసి కాంగ్రెస్‌లో చేరుతున్నట్లు ప్రకటించారు. వర్ని మండల వైస్ ప్రెసిడెంట్ బాలరాజుతో పాటు ఆరుగురు ఎంపీటీసీలు తాజా మాజీ సర్పంచులు, పార్టీ మండలాధ్యక్షుడు గిరి, కార్యదర్శి గోపాల్, 22 పంచాయతీల బీఆర్‌ఎస్ అధ్యక్ష కార్యదర్శులు, సొసైటీ చైర్మన్ సాయిబాబాతో పాటు వందల మంది కార్యకర్తలు రాజీనామా చేశారు. చందూరు ఎంపీపీ లావణ్య రాంరెడ్డితో పాటు మరో ఎంపీటీసీ ఐదుగురు మాజీ సర్పంచులు పార్టీ మండలాధ్యక్షుడితో పాటు ఆయా గ్రామాల అధ్యక్ష కార్యదర్శులు సైతం బీఆర్‌ఎస్‌ను వీడారు.

హస్తం గూటికి పోచారం

- కాంగ్రెస్ కండువా కప్పిన సీఎం రేవంత్‌రెడ్డి
- ఉమ్మడి జిల్లాలో బీఆర్‌ఎస్‌కు కోలుకోలేని దెబ్బ
- జిల్లాలో మారనున్న రాజకీయ సమీకరణాలు



పోచారం శ్రీనివాస్‌రెడ్డికి కాంగ్రెస్ కండువా కప్పుతున్న సీఎం రేవంత్‌రెడ్డి

సాక్షి, కామారెడ్డి: ఉమ్మడి జిల్లా రాజకీయాల్లో కీలక నేతగా ఎదిగిన మాజీ స్పీకర్, బాన్సువాడ ఎమ్మెల్యే పోచారం శ్రీనివాస్‌రెడ్డి బీఆర్‌ఎస్‌కు గుడ్‌బై చెప్పారు. శుక్రవారం కాంగ్రెస్ కండువా కప్పుకున్నారు. సీఎం రేవంత్‌రెడ్డి హైదరాబాద్‌లోని పోచారం నివాసానికి వెళ్లి మరీ పార్టీలోకి ఆహ్వానించారు. పోచారంతో పాటు ఆయన తనయులు డీసీసీబీ మాజీ చైర్మన్ పోచారం భాస్కర్‌రెడ్డి, పోచారం సురేందర్‌రెడ్డి, అలాగే పోచారం సోదరుడు శంభురెడ్డి కాంగ్రెస్‌లో చేరారు. పోచారం కాంగ్రెస్ పార్టీలో చేరడంతో ఉమ్మడి జిల్లాలో రాజకీయ సమీకరణాలు మారనున్నాయి.

కాంగ్రెస్ శ్రేణుల్లో ఆందోళన

పోచారం శ్రీనివాస్‌రెడ్డి కాంగ్రెస్ పార్టీలో చేరతారని కొంతకాలంగా ప్రచారం జరుగుతోంది. అయితే ఆయన చేరికను పలువురు కాంగ్రెస్ నేతలు వ్యతిరేకించారు. పోచారం రాకను అడ్డుకుంటామని బహిరంగంగానే ప్రకటించారు. నస్రుల్లాబాద్‌లో ఆయన దిష్టిబొమ్మను దహనం చేసి నిరసన తెలిపారు. తమ అభిప్రాయాలను పరిగణనలోకి తీసుకోవాలని రాష్ట్ర నాయకత్వాన్ని కోరారు. అయినా పోచారం శ్రీనివాస్‌రెడ్డిని కాంగ్రెస్‌లో చేర్చుకోవడంతో పార్టీ శ్రేణులు షాక్‌కు గురవుతున్నాయి. ఏళ్లుగా పార్టీలో పనిచేస్తున్న తమ పరిస్థితి ఏమిటని వారు ఆందోళన చెందుతున్నారు. కాగా పోచారం పార్టీ మారడంతో రాజకీయ సమీకరణాలు మారుతాయని భావిస్తున్నారు. ఉమ్మడి నిజామాబాద్ జిల్లాలో బీఆర్‌ఎస్‌కు పెద్దదిక్కుగా వ్యవహరిస్తూ వచ్చిన పోచారం కారు దిగడంతో ఆ పార్టీకి తీవ్ర నష్టం వాటిల్లుతుందని భావిస్తున్నారు. అయితే దశాబ్దాలుగా పోచారం వెంట ఉన్న నాయకులు ఆయనతో కలిసి కాంగ్రెస్‌లో చేరుతారా? బీఆర్‌ఎస్‌లోనే ఉండిపోతారా? అన్నదానిపై చర్చ నడుస్తోంది.

రాజకీయ ప్రస్థానం..

బాన్సువాడ నియోజకవర్గంలోని పోచారం గ్రామానికి చెందిన పరిగి శ్రీనివాస్‌రెడ్డి ఇంజినీరింగ్ విద్య నభ్యసించారు. అనంతరం రాజకీయాల మీద ఆసక్తితో కాంగ్రెస్ పార్టీలో చేరారు. 1978 లో బాన్సువాడ మండలంలోని దేశాయిపేట సింగిల్ విండో చైర్మన్ అయ్యారు. 1984లో ఎన్టీఆర్ తెలుగుదేశం పార్టీని స్థాపించడంతో ఆ పార్టీలో చేరారు. టీడీపీలో క్రియాశీలకంగా పనిచేసిన పోచారం.. 1987లో ఉమ్మడి జిల్లా కేంద్ర సహకార బ్యాంకు చైర్మన్ అయ్యారు. 1989 సార్వత్రిక ఎన్నికల్లో నిజామాబాద్ ఎంపీగా పోటీ చేసి ఓటమి చవిచూశారు. టీడీపీలో జిల్లా అధ్యక్షుడిగా, రాష్ట్ర కార్యదర్శిగానూ పనిచేశారు. 1994లో తొలిసారిగా బాన్సువాడ అసెంబ్లీ స్థానం నుంచి పోటీ చేసి ఎమ్మెల్యే అయ్యారు. 1999 లో రెండోసారి గెలిచి, చంద్రబాబు ప్రభుత్వంలో మంత్రిగా పనిచేశారు. 2004 ఎన్నికల్లో కాంగ్రెస్ అభ్యర్థి బాజిరెడ్డి గోవర్ధన్ చేతిలో ఓడిపోయారు. 2009 ఎన్నికల్లో తిరిగి ఎమ్మెల్యేగా విజయం సాధించారు. 2011 లో తెలంగాణ ఉద్యమం ఉధృతంగా సాగుతున్న సమయంలో టీడీపీకి, ఎమ్మెల్యే పదవికి రాజీనామా చేసి టీఆర్‌ఎస్ పార్టీలో చేరారు. ఉప ఎన్నికల్లో పోటీ చేసి విజయం సాధించారు. 2014 ఎన్నికల్లోనూ గెలిచిన ఆయన.. బీఆర్‌ఎస్ సారథ్యంలోని రాష్ట్ర ప్రభుత్వంలో వ్యవసాయ శాఖ మంత్రిగా పనిచేశారు. 2018 ఎన్నికల్లోనూ గెలిచిన ఆయన.. అసెంబ్లీ స్పీకర్‌గా ఐదేళ్లు సేవలందించారు. స్పీకర్ హోదాలో పనిచేసిన వారు తిరిగి గెలిచిన సందర్భాలు లేవని, ఇక పోచారం శకం ముగిసినట్టేనని అందరూ భావించారు. ఆ సెంటిమెంట్‌ను అధిగమించి పోచారం 2023 ఎన్నికల్లోనూ మరోసారి విజయఢంకా మోగించారు. రాష్ట్రంలో బీఆర్‌ఎస్ అధికారంలోకి వస్తే మంత్రి పదవి వరిస్తుందని భావించారు. కానీ బీఆర్‌ఎస్ ఓడిపోవడంతో కొంత నిరాశచెందారు.

బాజిరెడ్డి సవాల్

2004 ఎన్నికల్లో పోచారం శ్రీనివాస్‌రెడ్డిని ఓడించిన మాజీ ఎమ్మెల్యే బాజిరెడ్డి గోవర్ధన్ బాన్సువాడకు తిరిగి రావచ్చని భావిస్తున్నారు. బాజిరెడ్డికి బాన్సువాడ నియోజకవర్గంలో మంచి పట్టుంది. ఆయన నియోజకవర్గంలో చాలామంది అనుచరులున్నారు. పోచారం పార్టీ మార్పు తర్వాత బాజిరెడ్డి మీడియాతో మాట్లాడారు. బీఆర్‌ఎస్ నుంచి గెలిచిన పోచారం తన పదవికి రాజీనామా చేయాలని, ఉప ఎన్నికలో తనతో పోటీ పడాలని సవాల్ చేశారు. ప్రస్తుతం పోచారం కాంగ్రెస్‌లో చేరడంతో బాన్సువాడ నియోజకవర్గంలో బీఆర్‌ఎస్‌కు నాయకత్వ సమస్య ఎదురవనుంది. ఈ నేపథ్యంలో బాన్సువాడలో పట్టున్న బాజిరెడ్డి గోవర్ధన్ ఇక్కడికి వస్తారన్న ప్రచారం జరుగుతోంది. పోచారం శ్రీనివాస్‌రెడ్డికి సవాల్ విసరడం ద్వారా బాజిరెడ్డి సైతం ఇక్కడికి రావడానికి సిద్ధంగా ఉన్నానన్న సంకేతాలు ఇచ్చారు.

బీఆర్‌ఎస్‌లో ఏం తక్కువయ్యిందని పార్టీ వీడారు..



కేసీఆర్ ఏం తక్కువ చేశారని పార్టీ మారారని బాన్సువాడ ఎమ్మెల్యే పోచారం శ్రీనివాస్ రెడ్డిని మాజీ మంత్రి ప్రశాంత్‌రెడ్డి ఓ ప్రకటనలో ప్రశ్నించారు. ''మిమ్మల్ని ఎప్పుడూ లక్ష్మీపుత్రుడని సంబోధిస్తూ అధిక ప్రాధాన్యత ఇచ్చారు. మిమ్మల్ని ఎప్పుడూ పెద్దలు శ్రీనివాస్‌రెడ్డి గారు అంటూ ముందు వరుసలోనే తన పక్కనే కూర్చుండబెట్టుకునే వారు. మిమ్మల్ని మాకు ఆదర్శంగా చూపిస్తూ మీ గురించి గొప్పగా చెప్పేవారు. వ్యవసాయ శాఖ మంత్రిగా, స్పీకర్‌గా సమున్నత స్థానం కల్పించారు. బాన్సువాడ అభివృద్ధికి అడిగినన్ని నిధులిచ్చారు. సీఎం డెవలప్‌మెంట్ ఫండ్ నుంచి అత్యధికంగా నిధులు తీసుకున్నది మీరే. నేను హౌసింగ్ మినిస్టర్‌గా ఉన్నా నాకంటే ఎక్కువగా బాన్సువాడకు డబుల్ బెడ్రూం ఇళ్లు మంజూరు చేశారు. మీరు ఇష్టదైవంగా భావించే తెలంగాణ తిరుమల గుడికి కూడా అడిగినన్ని నిధులు ఇచ్చారు. అలాంటి కేసీఆర్‌ను మోసం చేసి వెళ్లిపోతారా'' అంటూ పోచారం శ్రీనివాస్‌రెడ్డిపై ఆగ్రహం వ్యక్తం చేశారు. ప్రాణం పోయే వరకు కేసీఆర్ వెంటే ఉంటానన్న విషయాన్ని గుర్తు చేశారు. అధికారం, పదవులు లేకుంటే బతకలేమా అని, ఈ వయసులో పార్టీ మారడం భావ్యమా అని ప్రశ్నించారు. పార్టీ క్లిష్ట పరిస్థితుల్లో ఉన్న సమయంలో కేసీఆర్‌కు వెన్నుపోటు పొడిచి పోచారం శ్రీనివాస్‌రెడ్డి కాంగ్రెస్‌లో చేరడం దారుణమని, బాన్సువాడ ప్రజలు తగిన బుద్ధి చెబుతారని పేర్కొన్నారు.

బదిలీల కోసం టీచర్ల నిరీక్షణ

- ఖాళీల తుది జాబితాను ప్రకటించని విద్యాశాఖ
- ప్రక్రియ ఆలస్యం అయ్యే అవకాశం



బదిలీల కోసం దరఖాస్తు చేసుకుంటున్న టీచర్లు

కామారెడ్డి టౌన్: బదిలీల కోసం ఉపాధ్యాయులకు నిరీక్షణ తప్పేలా లేదు. పదోన్నతులు ప్రక్రియ పూర్తి కావడంతో జిల్లాలో 787 మంది ఉపాధ్యాయులు ప్రమోషన్ పొంది, వారి స్థానాల్లో జాయిన్ అయ్యారు. ఈ క్రమంలో షెడ్యూల్ ప్రకారం ఎస్జీటీల బదిలీ ప్రక్రియ రెండు రోజుల క్రితమే ప్రారంభం కావాల్సి ఉంది. కానీ ఇప్పటి వరకు విద్యాశాఖ, ప్రభుత్వం నుంచి ఖాళీల తుది జాబితా జిల్లా అధికారులకు చేరలేదు. దీంతో ఎస్జీటీల బదిలీల ప్రక్రియ ఆలస్యం అయ్యే అవకాశం ఉందని అధికారులు చెబుతున్నారు. దీంతో బదిలీలు కోసం దరఖాస్తు చేసుకున్న ఉపాధ్యాయులకు ఎదురుచూపులు తప్పడం లేదు.

కొలిక్కిరాని తుది జాబితా

బదిలీల కోసం ఆరు నెలల క్రితం జిల్లాలో 1400 పైగా ఉపాధ్యాయులు ఆన్‌లైన్‌లో దరఖాస్తులు చేసుకుని డీఈవో కార్యాలయంలో పత్రాలను సమర్పించారు. అయితే వీరిలో చాలా మందికి తాజాగా పదోన్నతులు దక్కాయి. అలాగే ఉపాధ్యాయ దంపతులు(స్పౌస్), మార్పులు, చేర్పులు, 8 ఏళ్ల సర్వీస్ పూర్తి చేసుకుని గతంలో దరఖాస్తు చేసుకోని వారు, రెండేళ్ల సర్వీస్ పూర్తి చేసుకుని ఆసక్తి ఉన్న ఉపాధ్యాయుల నుంచి ఈనెల 20 సాయంత్రం 5 గంటల వరకు బదిలీల కోసం దరఖాస్తులను స్వీకరించారు. రాష్ట్రవ్యాప్తంగా ఈ దరఖాస్తులను ఆన్‌లైన్ పొందుపరుస్తున్నారు. గతంలో బదిలీల కోసం దరఖాస్తు చేసుకుని తాజాగా పదోన్నతులు పొందిన వారిని తీసివేసి నూతనంగా దరఖాస్తు చేసుకున్న వారి వివరాలు ఆన్‌లైన్‌లో పొందుపరిచే పనిలో సిబ్బంది నిమగ్నమయ్యారు. ఈ క్రమంలో విద్యాశాఖ నుంచి ఎస్జీటీల ఖాళీల తుది జాబితా ప్రకటించాల్సి ఉంది. ఆ జాబితా ఆలస్యంగా వెలువడే అవకాశం ఉంది. దీంతో బదిలీల ప్రక్రియ ఈ నెల చివరి వారంలో ప్రారంభం కావొచ్చని అధికారులు అంచనా వేస్తున్నారు. త్వరగా ప్రక్రియ పూర్తి చేయాలని ఉపాధ్యాయులు కోరుతున్నారు.

పెన్షనర్ల సమస్యలు పరిష్కరించాలి



సమావేశానికి హాజరైన వివిధ జిల్లాల ప్రతినిధులు

కామారెడ్డి అర్బన్: పెన్షన్‌దారుల సమస్యలను వెంటనే పరిష్కరించాలని రాష్ట్ర ప్రభుత్వ రిటైర్డ్ ఉద్యోగుల సంఘం అధ్యక్షుడు చిల్వేరి చంద్రశేఖర్, జనరల్ సెక్రెటరీ సి చంద్రశేఖర్ డిమాండ్ చేశారు. సంఘం నాలుగో రాష్ట్ర కార్యవర్గ సమావేశం కామారెడ్డి జిల్లా విశ్రాంత ఉద్యోగుల సంఘ భవనంలో శుక్రవారం నిర్వహించారు. వారు మాట్లాడుతూ.. పెన్షన్‌దారుల సమస్యల పరిష్కారం కోసం ప్రభుత్వంపై ఒత్తిడి తీసుకురావడానికి ఆందోళనకు సిద్ధంగా ఉండాలన్నారు. పెన్షనర్ల రాష్ట్ర మీటింగ్‌కు సీఎం ఇప్పటికీ సమయం ఇవ్వడం లేదన్నారు. నగదు రహిత ఆరోగ్య బీమా కార్డులు, 40 శాతం పీఆర్సీ, పెండింగ్ డీఏలు తదితర సమస్యలు పరిష్కరించాలన్నారు. సమావేశంలో వివిధ అంశాలపై చర్చించి ఆమోదించారు. సమావేశానికి హాజరైన అన్ని జిల్లాల ప్రతినిధులను కామారెడ్డి జిల్లా అధ్యక్షుడు నిట్టు విఠల్‌రావు సన్మానించారు. సమావేశంలో రాష్ట్ర కోశాధికారి పెంటయ్య, అసోసియేట్ అధ్యక్షుడు విశ్వనాథం, గంగాగౌడ్, నాగాగౌడ్, శ్యాంరావు తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న రాష్ట్ర అధ్యక్షుడు చంద్రశేఖర్

మహిళలను ఆర్థికంగా బలోపేతం చేయడమే లక్ష్యం

- కలెక్టర్ ఆశిష్ సంగ్వాన్



మాట్లాడుతున్న కలెక్టర్ సంగ్వాన్

కామారెడ్డి క్రైం: మహిళలను ఆర్థికంగా బలోపేతం చేయడమే లక్ష్యంగా రాష్ట్ర ప్రభుత్వం మహిళా శక్తి కార్యక్రమాన్ని చేపట్టిందని కలెక్టర్ ఆశిష్ సంగ్వాన్ అన్నారు. శుక్రవారం కలెక్టరేట్‌లో డీపీఎంలు, ఏపీఎంలు, కమ్యూనిటీ కో ఆర్డినేటర్లకు ఏర్పాటు చేసిన శిక్షణ తరగతులకు ఆయన ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. మహిళా శక్తి ద్వారా 14 రకాల కార్యక్రమాలను ప్రభుత్వం చేపడుతుందని తెలిపారు. అందులో భాగంగా విద్యార్థుల యూనిఫాంలు కుట్టే పనిని మహిళలకే అప్పగించిందన్నారు. జిల్లాలో 128 కేంద్రాల ద్వారా 1,997 మంది మహిళా సంఘ టైలర్‌లతో 77,550 దుస్తులు కుట్టిస్తున్నామని వివరించారు. ఇప్పటి వరకు 83 శాతం దుస్తులు పాఠశాలలకు అందజేశామన్నారు. ఈ నెల 25లోగా మిగతా దుస్తులను అందజేయాలని సూచించారు. మహిళా శక్తి కింద మైక్రో ఎంటర్‌ప్రైజెస్, కుట్టు కేంద్రాలు, పాడి పశువులు, బ్యాక్‌యార్డ్ పౌల్ట్రీ, పౌల్ట్రీ మథర్ యూనిట్‌లు, సంచార మత్స్య విక్రయ ఔట్‌లెట్‌లు, మిల్క్ పార్లర్‌లు, మీ సేవ, ఈవెంట్ మేనేజ్‌మెంట్, మహిళా క్యాంటీన్లు, ప్లాస్టిక్ వేస్ట్ మేనేజ్‌మెంట్, ఫుడ్ ప్రాసెసింగ్, కస్టం హైరింగ్ కేంద్రాలు లాంటి 14 రకాల కార్యకలాపాలు చేపట్టడానికి మండలాల వారీగా కార్యాచరణ రూపొందించాలన్నారు. జిల్లాలోని 17,158 స్వయం సహాయక సంఘాల ద్వారా రూ.186.43 కోట్ల పెట్టుబడులతో 17,960 యూనిట్లు నెలకొల్పడమే లక్ష్యంగా పని చేయాలని అధికారులకు సూచించారు. ఈ ఆర్థిక సంవత్సరానికి యూనిట్ల గ్రౌండింగ్‌కు చర్యలు తీసుకోవాలన్నారు. స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ శ్రీనివాస్‌రెడ్డి, డీఆర్‌డీవో చందర్, లీడ్ జిల్లా మేనేజర్ రవికాంత్ పాల్గొన్నారు.

● వెలుగులివ్వని సెంట్రల్ లైటింగ్



బర్రెను కొని తలుగుకు భయపడుతున్నట్లు ఉంది సర్కారు తీరు.. కామారెడ్డి పట్టణంలోని దేవునిపల్లి హైస్కూల్ నుంచి దేవి విహార్ కాలనీ ముగింపు వరకు రోడ్డు విస్తరణ చేపట్టారు. డివైడర్లు నిర్మించి సెంట్రల్ లైటింగ్ వ్యవస్థ ఏర్పాటు చేశారు. అయితే ఈ పనులు పూర్తై నెలలు గడుస్తున్నా.. విద్యుత్ కనెక్షన్ మాత్రం ఇవ్వడం లేదు. ఆయా పనులకు కోట్లాది రూపాయలు వెచ్చించిన సర్కారు.. విద్యుత్ కనెక్షన్‌కు రూ. 25 వేలు ఖర్చు చేయడానికి ముందుకు రాకపోవడంతో సెంట్రల్ లైటింగ్ వ్యవస్థ నిరుపయోగంగా ఉంది. పాలకులు స్పందించి సెంట్రల్ లైటింగ్‌కు విద్యుత్ కనెక్షన్ ఇప్పించి చీకట్లను దూరం చేయాలని ప్రజలు కోరుతున్నారు.

– సాక్షి, కామారెడ్డి

యోగాతో మానసిక ప్రశాంతత

- కలెక్టర్ ఆశిష్ సంగ్వాన్



యోగా డేలో పాల్గొన్న వైద్య విద్యార్థులు



యోగాసనాలు వేస్తున్న కలెక్టర్ ఆశిష్ సంగ్వాన్

కామారెడ్డి క్రైం: నిత్యం యోగా చేస్తే ఆరోగ్య సమస్యలు దరిచేరవని, మానసిక ప్రశాంతత లభిస్తుందని కలెక్టర్ ఆశిష్ సంగ్వాన్ అన్నారు. అంతర్జాతీయ యోగా దినోత్సవం సందర్భంగా ఆయుష్ శాఖ ఆధ్వర్యంలో కామారెడ్డిలోని ప్రభుత్వ వైద్య కళాశాలలో శుక్రవారం ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. ప్రపంచానికి యోగాను పరిచయం చేసింది మన దేశమేనన్నారు. ×ఈ సంవత్సరం నా కోసం, సమాజం కోసం యోగా₹ అనే అంశంతో కార్యక్రమాన్ని చేపట్టామని పేర్కొన్నారు. శారీరకంగా, మానసికంగా ధృడంగా ఉండడానికి, ఒత్తిడిని అధిగమించడానికి యోగా, ప్రాణాయామం చేయాలని సూచించారు. ప్రతి రోజూ 15–20 నిమిషాలు యోగాకు కేటాయిస్తే ఆరోగ్య సమస్యలు దరిచేరవని పేర్కొన్నారు. ఈ సందర్భంగా వైద్య విద్యార్థులతో కలిసి పలు ఆసనాలు, ప్రాణాయామం చేశారు. అనంతరం కళాశాలలోని పలు విభాగాలను పరిశీలించి వైద్య విద్యార్థులతో మాట్లాడారు. వైద్య కళాశాలకు కేటాయించిన 20 ఎకరాల స్థలంలో నిర్మాణంలో ఉన్న క్రిటికల్ కేర్, వసతి గృహాల పనులను పరిశీలించారు. ఈ కార్యక్రమంలో ఆయుష్ కో ఆర్డినేటర్ సిహెచ్ వెంకటేశ్వర్లు, వైద్య కళాశాల ప్రిన్సిపాల్ వెంకటేశ్వర్లు, జిల్లా ఆస్పత్రి సూపరింటెండెంట్ రామ్‌సింగ్, యోగా శిక్షకులు పాల్గొన్నారు.

యోగాతో సంపూర్ణ ఆరోగ్యం

కామారెడ్డి క్రైం: యోగాతో సంపూర్ణ ఆరోగ్యం లభిస్తుందని కామారెడ్డి ఎమ్మెల్యే కాటిపల్లి వెంకటరమణారెడ్డి అన్నారు. జిల్లా కేంద్రంలోని యోగా భవన్‌లో శుక్రవారం ఉదయం కేంద్ర సమాచార, ప్రసార మంత్రిత్వ శాఖకు చెందిన సెంట్రల్ బ్యూరో ఆఫ్ కమ్యూనికేషన్ ఫీల్డ్ ఆఫీస్ నిజామాబాద్, పతంజలి యోగా సమితి ఆధ్వర్యంలో అంతర్జాతీయ యోగా దినోత్సవం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ.. ప్రజలందరూ ఆరోగ్యంగా, శాంతి, సామరస్యంతో జీవించాలని 2014లో ప్రధాని మోదీ జూన్ 21న యోగా దినోత్సవాన్ని నిర్వహించాలని ఐక్యరాజ్య సమితిలో ప్రతిపాదించగా అన్ని సభ్య దేశాలు మద్దతు తెలిపినట్లు గుర్తు చేశారు. యోగా చేయడంతో మానసిక ప్రశాంతత లభిస్తుందన్నారు. పాఠశాలల స్థాయి నుంచే విద్యార్థులకు యోగాను పరిచయం చేయాలన్నారు. వ్యాస రచన, ఉపన్యాస పోటీల్లో ప్రతిభ కనబరిచిన విద్యార్థులకు బహుమతులు అందజేశారు. కామారెడ్డిలో ఉచితంగా యోగా శిక్షణ ఇస్తున్న గురువులను సన్మానించారు. కార్యక్రమంలో సీబీసీ ఫీల్డ్ పబ్లిసిటీ ఆఫీసర్ బి ధర్మానాయక్, పతంజలి యోగా సమితి అధ్యక్షుడు రామ్‌రెడ్డి, యోగా గురువులు అంజయ్యగుప్తా, అనిల్ కుమార్, అంతిరెడ్డి, గంగారెడ్డి, రామ్ చంద్ర, వ్యాయామ ఉపాధ్యాయులు పాల్గొన్నారు.



ఆసనాలు వేస్తున్న చిన్నారులు



యోగా చేస్తున్న ఎమ్మెల్యే వెంకటరమణారెడ్డి

క్లుప్తంగా

అద్దె వాహనాల బిల్లులు ఇప్పించాలి



కామారెడ్డి క్రైం : తెలంగాణ ఫోర్ వీలర్ డ్రైవర్ అసోసియేషన్ ప్రతినిధులు కలెక్టరేట్‌లో కామారెడ్డి నూతన కలెక్టర్ ఆశిష్ సంగ్వాన్‌ను శుక్రవారం మర్యాదపూర్వకంగా కలిశారు. పలు శాఖలలో సక్రమంగా ఇవ్వని అద్దె వాహనాల బిల్లులను ఇప్పించాలని కలెక్టర్‌కు విన్నవించారు. అందుకు కలెక్టర్ సంగ్వాన్ సానుకూలంగా స్పందించినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో అసోసియేషన్ జిల్లా అధ్యక్షుడు రాజాగౌడ్, కోశాధికారి మోయిన్ ఖాన్, ఆర్గనైజర్ రాజేష్, బాలరాజు, చంద్రశేఖర్, కుమార్, తదితరులు పాల్గొన్నారు.

ఉపాధ్యాయులకు సన్మానం



లింగంపేట(ఎల్లారెడ్డి): మండలంలోని సజ్జన్‌పల్లి ప్రాథమికోన్నత పాఠశాలకు నూతనంగా వచ్చిన హెచ్‌ఎం సాయన్న, ఉపాధ్యాయులను విద్యార్థులు, గ్రామస్తులు, ఉపాధ్యాయులు శుక్రవారం ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడారు. పాఠశాల అభివృద్ధికి ప్రతీ ఒక్కరూ సహకరించాలన్నారు. కార్యక్రమంలో అమ్మ ఆదర్శ పాఠశాల కమిటీ చైర్మన్ భవాని, దామోదర్, సత్యనారాయణ, రవి, పద్మ, ప్రతిమ, కవిత ఉన్నారు.

నాణ్యతతో వంతెన నిర్మాణం చేపట్టాలి



నాగిరెడ్డిపేట(ఎల్లారెడ్డి) : మండలంలోని లింగంపల్లికలాన్ గ్రామం వద్ద పోచారం ప్రధాన కాలువపై చేపట్టిన వంతెన నిర్మాణ పనుల్లో నాణ్యతను పాటించాలని నాగిరెడ్డిపేట ఎంపీపీ వినీతారెడ్డి, జెడ్పీటీసీ మనోహర్‌రెడ్డి సూచించారు. మండలంలోని లింగంపల్లికలాన్ వద్ద జరుగుతున్న వంతెన నిర్మాణ పనులను శుక్రవారం వారు పరిశీలించారు. వర్షాలు కురిస్తే పనులకు ఆటంకం కలుగుందని, ఈ నేపథ్యంలో పనులను వేగవంతం చేయాలని వారు సూచించారు. వారివెంట ఇరిగేషన్ ఇన్‌స్పెక్టర్ యాదగిరి ఉన్నారు.

ఐఐటీలో గిరిజన విద్యార్థి ప్రతిభ



లింగంపేట(ఎల్లారెడ్డి): మండలంలోని ఎక్కపల్లితండాకు చెందిన గిరిజన విద్యార్థి సభావత్ అరుణ్‌సింగ్ ప్రతిభ చాటినట్లు తండా వాసులు తెలిపారు. గురువారం సాయంత్రం వెలువడిన జేఈఈ అడ్వాన్స్‌డ్ ఆల్ ఇండియాలో 135వ ర్యాంకు సాధించినట్లు తెలిపారు. సదరు విద్యార్థికి ఐఐటీ ఖరగ్‌పూర్ సీటు వచ్చినట్లు పేర్కొన్నారు. ఎక్కపల్లితండాకు చెందిన గోవింద్ అనితల కుమారుడు అరుణ్‌సింగ్. తల్లిదండ్రులు, తండా వాసులు, బంధువులు, విద్యార్థిని అభినందించారు.

అటవీ సంపదను పరిరక్షించాలి

ఎల్లారెడ్డి : అటవీ సంపదను పరిరక్షించాలని ఎమ్మెల్యే మదన్‌మోహన్‌రావు అటవీశాఖ అధికారులకు సూచించారు. శుక్రవారం ఎమ్మెల్యే క్యాంప్ కార్యాలయంలో అటవీశాఖ, విద్యాశాఖ, సివిల్ సప్లై, ఆర్‌అండ్‌బీ, మిషన్ భగీరథ, మున్సిపాలిటీ అధికారులతో సమీక్ష నిర్వహించారు. సమావేశంలో ఎమ్మెల్యే అధికారులతో మాట్లాడుతూ అటవీ సంపద అన్యాక్రాంతం కాకుండా చూడాలని, అటవీ ప్రాంతంలో ఎక్కువగా మొక్కలను నాటాలని సూచించారు. రేషన్ దుకాణాల ద్వారా నాణ్యమైన బియ్యం సరఫరా జరిగేలా చూడాలని, రీసైక్లింగ్ బియ్యం సరఫరా జరిగితే కఠిన చర్యలను తీసుకుంటామని సివిల్ సప్లై అధికారులకు సూచించారు. కార్యక్రమంలో ఆయా శాఖల అధికారులు తదితరులు పాల్గొన్నారు.



సమీక్ష నిర్వహిస్తున్న ఎమ్మెల్యే మదన్‌మోహన్‌రావు

గిరిజన విద్యార్థికి సన్మానం

నాగిరెడ్డిపేట(ఎల్లారెడ్డి) : మండలంలోని మెల్లకుంటతండాకు చెందిన రమావత్ వీణను శుక్రవారం ఎల్లారెడ్డిలో స్థానిక ఎమ్మెల్యే మదన్‌మోహన్‌రావు కాంగ్రెస్ మండలాధ్యక్షుడు శ్రీధర్‌గౌడ్ సమక్షంలో ఘనంగా సత్కరించారు. వీణ ఇటీవల క్యాట్ పరీక్ష రాసి ఉత్తమ ర్యాంకు సాధించడంతో ఆమెకు దేశంలోనే అత్యున్నతమైన ఒరిస్సాలోని సంబల్పూర్‌లో గల ఐఐఎం (ఇండియన్ ఇనిస్టిట్యూట్ ఆఫ్ మేనేజ్‌మెంట్) కళాశాలలో ఎంబీఏ కోర్స్ చదవడానికి సీటు వచ్చింది. ఈ మేరకు ఎమ్మెల్యే తన కార్యాలయంలో వీణను సత్కరించారు. వీణ చదువుకు సహకారం అందిస్తానని ఎమ్మెల్యే పేర్కొన్నారు. జెడ్పీటీసీ మనోహర్‌రెడ్డి తండావాసులు పాల్గొన్నారు.



విద్యార్థిని వీణను సన్మానిస్తున్న ఎమ్మెల్యే

పాఠశాలల్లో పనులు పూర్తి చేయాలి

బాన్సువాడ రూరల్ : అమ్మ ఆదర్శ పాఠశాలల్లో ప్రారంభించిన ఆధునీకరణ పనులను వెంటనే పూర్తిచేయాలని కామారెడ్డి జిల్లా అదనపు కలెక్టర్ శ్రీనివాస్‌రెడ్డి ఆదేశించారు. శుక్రవారం ఆయన బాన్సువాడ మండలంలోని జక్కల్‌దాని తండాలో ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలలో కొనసాగుతున్న పనులను స్థానిక అధికారులతో కలిసి పరిశీలించారు. మండలంలోని వివిధ గ్రామల్లోని పాఠశాలల్లో పనుల పురోగతిని అడిగి తెల్సుకున్నారు. పాఠశాలలు పునః ప్రారంభం అయిన నేపథ్యంలో పనులను త్వరగా పూర్తిచేయాలని ఆదేశించారు. విద్యార్థులకు ఎలాంగి ఇబ్బంది కలుగకుండా పనులు చేపట్టాలన్నారు. ఆయన వెంట డీపీవో శ్రీనివాస్, ఎంపీపీ నీరజారెడ్డి, డీఎప్పీవో నాగరాజు, ఎంపీడీవో బషీరుద్దీన్, ఎంఈవోనాగేశ్వరావు, ఎంపీవో సత్యనారాయణరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

నస్రుల్లాబాద్‌లో..

నస్రుల్లాబాద్(బాన్సువాడ) : ఈనెల 26 వరకు ప్రతి గ్రామంలో ఉన్న పాఠశాలలో అమ్మ ఆదర్శ కమీటీల ఆధ్వర్యంలో జరుగుతున్న మరమ్మత్తులను పూర్తి చేయాలని స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ డి శ్రీనివాస్ అన్నారు. శుక్రవారం మండల కేంద్రంలో ఉన్న జెడ్పీహెచ్‌ఎస్ పాఠశాలలో జరుగుతున్న పనులను పరిశీలన చేశారు. అనంతరం గ్రామంలో ఉన్న నర్సరీ పరిశీలన చేసి మొక్కల వద్ద పేర్లు ఉన్న బోర్డులను ఏర్పాటు చేయాలని ఏపీవో సౌజన్యకు ఆదేశించారు. ఆయన వెంట ఎంపీడీవో నీలావతి, ఎంపీవో రాము, పీఆర్‌టీయూ మండల అధ్యక్షులు గునిగెరి హన్మాండ్లు తదితరులు ఉన్నారు.



జక్కల్‌దాని తండా పాఠశాలలో పనులు పరిశీలిస్తున్న అదనపు కలెక్టర్ శ్రీనివాస్ రెడ్డి

ట్రాన్స్‌కో ఏఈపై కలెక్టర్‌కు ఫిర్యాదు



భిక్కనూరు : మండల కేంద్రం నుంచి గిద్ద దళితవాడకు వెళ్లె దారిలో నడిరోడ్డుపైన ఉన్న విద్యుత్‌స్తంభాన్ని తొలగించాలని పలుమార్లు ట్రాన్స్‌కో ఏఈ శ్రీనివాస్‌కు తెలిపినప్పటికీ పట్టించుకోవడం లేదని ఈ విషయమై కలెక్టర్‌కు ఫిర్యాదు చేస్తున్నట్లు భిక్కనూరు ఎంపీడీవో ప్రవీణ్‌కుమార్ శుక్రవారం తెలిపారు. ఈ విద్యుత్ స్తంభం వల్ల ప్రమాదాలు జరుగుతున్నాయని ఈ విషయమై గ్రామస్తులు పలువురు ట్రాన్స్‌కోకు ఫిర్యాదులు చేశారని అలాగే జీపీ సిబ్బంది కూడా ఈ విషయమై ట్రాన్స్‌కో ఏఈకి ఫిర్యాదు చేసినప్పటికీ తొలగించలేదని ఈ విషయమై కలెక్టర్‌కు ఫిర్యాదు చేస్తున్నామన్నారు.

'సృజన రచయితల సంగమం ఎన్నీల ముచ్చట్లు'



కామారెడ్డి అర్బన్:సృజన రచయితల సంగమంగా తెలంగాణ రచయితల వేదిక(తెరవే) ఎన్నీల ముచ్చట్లు కార్యక్రమం కొనసాగుతుందని తెరవే జిల్లా అధ్యక్షుడు సిరిసిల్ల గఫూర్ శిక్షక్ అన్నారు. శుక్రవారం సాయంత్రం పౌర్ణమి సందర్భంగా రచయిత చంద్రశేఖర్ నివాసంలో ఎన్నీల ముచ్చట్లు నిర్వహించారు. ఈ సాహిత్య కార్యక్రమంలో రచయిత, యోగా గురువు కాసర్ల రామచంద్రంను సన్మానించారు. ప్రతినిధులు యెంబరి లింగం, యెనిశెట్టి గంగాప్రసాద్, నాగభూషణం తదితరులు పాల్గొన్నారు.

భాషా పండితుల అప్‌గ్రేడేషన్ చరిత్రాత్మక నిర్ణయం

కామారెడ్డి టౌన్ : భాషా పండితుల అప్‌గ్రేడేషన్ హర్షణీయమని దివ్యాంగ ఉద్యోగ ఉపాధ్యా సంఘం రాష్ట్ర అధ్యక్షుడు జంగం శ్రీశైలం శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. 20ఏళ్లుగా పెండింగ్‌లో ఉన్న భాషా పండితుల, పీఈటీల అప్‌గ్రేడేషన్‌పై ప్రభుత్వం సానుకూలంగా స్పందించడంపై ఆనందం వ్యక్తం చేశారు.

పెద్దచెరువు సుందరీకరణకు స్థల పరిశీలన

ఎల్లారెడ్డి : ఎల్లారెడ్డి పెద్ద చెరువు సుందరీకణ కోసం స్థలాన్ని మున్సిపల్ చైర్మెన్ కుడుముల సత్యనారాయణ, హెచ్‌ఎండీఏ అధికారుతో కలిసి శుక్రవారం పరిశీలించారు. పెద్ద చెరువు అభివృద్ధికి కృషి చేయాలని ఎమ్మెల్యే మదన్‌మోహన్ రావు మున్సిపల్ అధికారులకు సూచించడంతో ఎమ్మెల్యే ఆదేశాల మేరకు హెచ్‌ఎండీఏ అధికారులు స్థానిక మున్సిపల్ కమిషనర్ శ్రీహరి రాజుతో కలిసి పెద్ద చెరువు వద్ద చిల్డ్రన్ పార్క్, వాకింగ్ వే తదితర పనులకు స్థలాన్ని పరిశీలించారు. మున్సిపల్ సిబ్బంది పాల్గొన్నారు.



ఎల్లారెడ్డి పెద్ద చెరువు సుందరీకరణ కోసం స్థలాన్ని పరిశీలిస్తున్న అధికారులు

రెడ్‌క్రాస్ సొసైటీ ఆధ్వర్యంలో ఆరోగ్య పరీక్షలు



పరీక్షలు నిర్వహిస్తున్న దృశ్యం

కామారెడ్డి అర్బన్ : ఇండియన్ రెడ్ క్రాస్ సొసైటీ ఆధ్వర్యంలో శుక్రవారం సీనియర్ సిటిజన్స్ జిల్లా భవనంలో 60ఏళ్లు పైబడిన వారికి ఉచిత ఆరోగ్యశిబిరం నిర్వహించారు. రెడ్‌క్రాస్ సొసైటీ తరఫున నిర్వహించిన శిబిరాల్లో ఇప్పటికీ 4300 మందికి పరీక్షలు చేసినట్టు జిల్లా చైర్మన్ ఎం రాజన్న అన్నారు. జిల్లా గ్రంథాలయ సంస్థ మాజీ చైర్మన్ పి.రాజేశ్వర్, సీనియర్ సిటిజన్స్ కార్యదర్శి రఘుకుమార్, ప్రతినిధులు పీవీ నరసింహం, వైద్యులు విక్రమ్, సౌమ్య, లత, ప్రణవి తదితరులు హాజరయ్యారు.

మెడికల్ షాపులు తనిఖీ

లింగంపేట(ఎల్లారెడ్డి) : మండల కేంద్రంలో శుక్రవారం పలు మెడికల్ షాప్‌లను జిల్లా డ్రగ్ ఇన్‌స్పెక్టర్ రాజిరెడ్డి ఆకస్మికంగా తనిఖీ చేశారు. మెడికల్ షాపుల్లో గడువు ముగిసిన మందులు విక్రయిస్తే కఠిన చర్యలు తీసుకుంటామన్నారు. మత్తు పదార్థాలకు సంబంధించిన మందులు విక్రయిస్తే కేసులు నమోదు చేసి లైసెన్సులు రద్దు చేస్తామన్నారు. నిషేధిత మందులు, అబార్షన్ కిట్స్, నిద్రమాత్రలు విక్రయించవద్దన్నారు.



లింగంపేటలోని మెడికల్ షాపులో మందులు పరిశీలిస్తున్న డ్రగ్ ఇన్‌స్పెక్టర్ రాజిరెడ్డి

జీరో బిల్లులు అందరికీ వర్తింపజేయాలి

సదాశివనగర్(ఎల్లారెడ్డి) : గృహలక్ష్మి పథకం కింద రెండు వందల యూనిట్ల వరకు ఉచిత కరంట్ అందిస్తామని వాగ్దానం చేసిందని, కానీ కొందరికే జీరో బిల్లులు వర్తిస్తున్నాయని, అందరికి ఎందుకు వర్తింపజేయడం లేదని ధర్మారావ్‌పేట్ ఎంపీటీసీ మహిపాల్ యాదవ్ ట్రాన్స్ ఏఈని నిలదీశారు. శుక్రవారం మండల పరిషత్ కార్యాలయంలో మండల సర్వసభ్య సమావేశాన్ని ఎంపీపీ గైని అనసూయ ఆధ్వర్యంలో నిర్వహించారు. ఆయా శాఖలపై తూతూ మంత్రంగా అధికారులు సమీక్ష నిర్వహించారు. అంగన్‌వాడీలకు సొంత భవనాలు కేటాయించాలని మండల కో–ఆప్షన్ అల్తాఫ్ సభ దృష్టికి తీసుకొచ్చారు. సమస్యలను లేవదీసే సర్పంచ్‌లు లేకపోవడంతో అధికారులు తూతూమంత్రంగా నివేదికలు సమర్పించారు. ఆర్‌అండ్‌బీ, ఎక్సైజ్ శాఖ అధికారులు గైర్హాజర్ కావడంతో ఎంపీడీవో అసహనం వ్యక్తం చేశారు. గ్రామాల్లో అన్ని చర్యలు తీసుకోవాలని ప్రత్యేకాధికారులను కోరారు. ఎంపీడీవో సంతోష్‌కుమార్, తహసీల్దార్ గంగాసాగర్, జెడ్పీటీసీ కమిలి నర్సింలు, వైస్ ఎంపీపీ శ్రీనివాస్ రెడ్డి, జెడ్పీ కో–ఆప్షన్ మోహినొద్దీన్ తదితరులున్నారు.



సమావేశంలో ట్రాన్స్‌కో ఏఈని నిలదీస్తున్న ఎంపీటీసీ మహిపాల్ యాదవ్

డాక్టరేట్లు అందుకున్న పరిశోధక విద్యార్థులు

భిక్కనూరు : తెయూ సౌత్‌క్యాంపస్‌లో జియో ఇన్ఫర్మేటిక్స్‌లో జే సతీష్ డాక్టరేట్ పట్టాను శుక్రవారం తెలంగాణ యునివర్సిటీ ద్వారా అందుకున్నారు. జియో ఇన్ఫర్మేటిక్స్ విభాగంతో సౌత్ క్యాంపస్‌లో డాక్టరేట్ పట్ట పొందిన తొలి వ్యక్తిగా సతీష్ నిలిచాడు. 'నిజామాబాద్ జిల్లా తెలంగాణ జీఐఎస్, రిమోట్ సెన్సింగ్, ఎహెచ్‌పీ టెక్నిక్ ఉపయోగించి ఓటు సమగ్ర విధానం అనే అంశం'పై జియో ఇన్ఫర్మేటిక్స్ క్లినిక్‌ల్ రమెటిక్ హెచ్‌వోడి కవితా తోరన్ పర్యవేక్షణలో సతీష్ పరిశోధన నిర్వహించారు.



తెయూ సౌత్‌క్యాంపస్‌లో పట్టా అందుకుంటున్న సతీశ్

గౌతమ్ కృష్ణతేజకు డాక్టరేట్..

భిక్కనూరు : తెలంగాణ యునివర్సిటీ సౌత్‌క్యాంపస్ జియో ఇన్ఫర్మేటిక్స్ విభాగంలో గుండా గౌతమ్ కృష్ణతేజ డాక్టరేట్ పట్టాను శుక్రవారం అందుకున్నారు. కృష్ణతేజ జియోఇన్ఫర్మేటిక్స్ అధ్యాపకుడు డాక్టర్ ఆర్ సుధాకర్‌గౌడ్ పర్యవేక్షణలో జియో డైనమిక్స్ ఆఫ్ బార్రెన్, ఐలాండ్ వాల్కనిజం ఇన్‌సెడ్స్‌ఫ్రామ్ జియో స్పెషల్ టెక్నాలజీ అనే అంశంలో పరిశోధన చేశారు. ఉస్మానియా విశ్వవిద్యాలయం భూగోళశాస్త్ర విభాగం ప్రొఫెసర్ నగేష్ ఆధ్వర్యంలో డాక్టర్ పట్టాను ప్రదానం చేశారు. ఈ సందర్భంగా కృష్ణతేజను తెయూ రిజిస్ట్రార్ ప్రొఫెసర్ యాదగిరి, సైన్స్ డీన్ ఆరతి, కంట్రోలర్ ఆఫ్ ఎగ్జామినేషన్స్ అరుణ, జియో ఇన్ఫర్మేటిక్స్ హెచ్‌ఓడీ కవితా తోరన్, అధ్యాపకులు సబిత, ప్రతిజ్ఞ నారాయణ అభినందించారు.



పట్టాను అందుకుంటున్న గౌతమ్‌కృష్ణతేజ

పశువుల కాపరి నుంచి డాక్టరేట్ వరకు..

లింగంపేట(ఎల్లారెడ్డి): పేదింటి రైతు బిడ్డ డాక్టరేట్ పట్టా సాధించి అందరి మన్ననలు పొందాడు. ఒకనాడు గొర్రెల కాపరిగా అడవికి వెళ్లి గొర్రెలను కాశాడు. కామారెడ్డి జిల్లా లింగంపేట మండలం పోతాయిపల్లి గ్రామానికి చెందిన ఎర్రం సాయిరాం చిన్ననాటి నుంచి చదువులో మంచి ప్రతిభ కనబర్చేవాడు. కుటుంబ పరిస్థితుల దృష్ట్యా చదువు మధ్య లో ఆపేసి తన తండ్రికి ఉన్న గొర్లను కాయడానికి తండ్రి వెంట వెళ్లేవాడు. అతని ప్రతిభను గుర్తించిన ఉపాధ్యాయులు తల్లిదండ్రులకు అవగాహన కల్పించి తిరిగి పాఠశాలలో చేర్పించారు. పది, ఇంటర్, డిగ్రీ,పీజీల్లో మంచి ప్రావీణ్యం, ప్రతిభ కనబర్చి మొదటి స్థానంలో ఉత్తీర్ణుడయ్యాడు. రాజనీతి శాస్త్రంలో డాక్టరేట్ పట్టాను శుక్రవారం ఉస్మానియా విశ్వవిద్యాలయం ప్రొఫెసర్ లత చేతుల మీదుగా అందుకున్నారు. గ్రామస్తులు సాయిరాంను అభినందించారు. '21వ శతాబ్దంలో శాశ్వతమైన వ్యూహాత్మక భాగస్వామ్యం దిశగా భారతదేశం, ఐరోపా కూటమి' అనే అంశంపై పరిశోధన చేసి డాక్టరేట్ పట్టా సాధించినట్లు తెలిపారు.



పట్టా అందుకుంటున్న ఎర్రం సాయిరాం

నేడు విద్యుత్ అంతరాయం

కామారెడ్డి అర్బన్ : ఈనెల 22న శనివారం ఉదయం 9 గంటల నుంచి 11 గంటల వరకు వివిధ మండలాల్లో విద్యుత్ సరఫరాలో అంతరాయం కలుగుతుందని డివిజనల్ ఇంజనీర్ సాలియా నాయక్ తెలిపారు. దోమకొండ, భిక్కనూర్, బీబీపేట, మాచారెడ్డి, పాల్వంచ మండలాల్లోని విద్యుత్ సబ్ స్టేషన్లలో మరమ్మతులున్నాయన్నారు.

మైనారిటీ సంక్షేమశాఖ టెండర్ల ఖరారు వాయిదా

కామారెడ్డి అర్బన్ : మైనారిటీ సంక్షేమ శాఖకు సంబంధించి జిల్లాలో 9 పాఠశాలలు, జూనియర్ కళాశాలకు ఆహార దినుసులు, కొడిగుడ్లు, కొడి మాంసం, కూరగాయలు, పండ్ల సరఫరాకు సంబంధించి టెండర్ల ఖరారును వాయిదా వేసినట్టు జిల్లా సంక్షేమాధికారి దయానంద్ ఒక ప్రకటనలో తెలిపారు.

దైవదర్శనానికి వెళ్లొస్తూ.. అనంతలోకాలకు

- ట్రాక్టర్ బోల్తాపడి ఒకరి మృతి
- నలుగురి పరిస్థితి విషమం
- 15 మందికి తీవ్రగాయాలు

పెద్దకొడప్‌గల్(జుక్కల్): దైవదర్శనానికి వెళ్లి వస్తుండగా ట్రాక్టర్ అదుపుతప్పి బోల్తాపడిన ఘటనలో ఒకరు మృతి చెందగా, నలుగురి పరిస్థితి విషమంగా ఉంది. ఘటనకు సంబంధించి పెద్దకొడప్‌గల్ ఎస్సై కోనారెడ్డి, జుక్కల్ ఎస్సై సత్యనారాయణ తెలిపిన వివరాల ప్రకారం. బిచ్కుంద మండల కేంద్రానికి చెందిన వల్లెపు నాగమ్మ కొలాస్‌లో ఉండే రేణుకాఎల్లమ్మకు దైవదర్శనం కోసం శుక్రవారం ఉదయం కుటుంబీకులతో పాటు, కుల సంఘ సభ్యులతో కలిసి ట్రాక్టర్‌లో వెళ్లారు. అమ్మవారి దర్శనం అనంతరం అందరూ సహపంక్తి భోజనం చేశారు. తిరుగు ప్రయాణంలో సంగారెడ్డి–నాందేడ్ 161 జాతీయ రహదారిపై జుక్కల్ చౌరస్తా సమీపంలో ట్రాక్టర్ అదుపు తప్పి బోల్తా పడింది. కాగా డ్రైవర్ మద్యం మత్తులో నిర్లక్ష్యపు డ్రైవింగ్ చేయడంతోనే ఈ ఘటన చోటు చేసుకుందని స్థానికులు తెలిపారు. ప్రమాదంలో అంజిలి(13) అక్కడికక్కడే మృతి చెందంగా నలుగురి పరిస్థితి విషమంగా ఉందని, మరో 15 మందికి తీవ్రగాయాలయ్యాయి. ఘటన విషయం తెలుసుకున్న పెద్దకొడప్‌గల్ ఎస్సై కోనారెడ్డి అక్కడికి చేరుకొని గాయాలైన వారిని హైవే అంబులెన్స్‌లో బాన్సువాడ ఏరియా ఆస్పత్రికి తరలించారు. డ్రైవర్ వల్లెపు రాజుతో పాటు వల్లెపు అంజయ్య, వల్లెపు వెంకవ్వ పరిస్థితి విషమంగా ఉండడంతో నిజామాబాద్ జిల్లా ఆస్పత్రికి తరలించారు. మృతురాలి తండ్రి గురు ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు జుక్కల్ ఎస్సై సత్యనారాయణ పేర్కొన్నారు.



క్రేన్ సాయంతో ట్రాక్టర్‌ను తొలగిస్తున్న సిబ్బంది

క్రైం కార్నర్

అటవీ ప్రాంతంలో మహిళ మృతి



పర్జాన(ఫైల్)

భిక్కనూరు: మండలంలోని తిప్పాపూర్ అటవీ ప్రాంతంలో మహిళ మృతి చెందినట్లు గ్రామస్తులు శుక్రవారం తెలిపారు. గ్రామానికి చెందిన పర్జాన(33) ఈనెల 19న ఉదయం ఇంటి నుంచి కట్టెలు తెచ్చేందుకు అటవీ ప్రాంతానికి వెళ్లింది. తిరిగి రాకపోవడంతో కుటుంబీకులు, గ్రామస్తులు వెతకడంతో గురువారం రాత్రి ఆమె మృతదేహం అటవీ ప్రాంతంలోని రోళ్లబండ ప్రాంతంలోని చిన్నకుంట వద్ద లభించింది. పర్జానపై గుర్తు తెలియని అటవీ జంతువు దాడి చేయడంతోనే మృతి చెందినట్లు గ్రామస్తులు తెలిపారు. ఆమె కుడి చేయిపై జంతువు తీవ్రంగా గాయం చేసినట్లు ఆనవాళ్లు ఉన్నాయని పేర్కొన్నారు. గ్రామంలో విషాద చాయలు అలుముకున్నాయి. పర్జానకు భర్త నజీమొద్దీన్, ఇద్దరు చిన్నారులు ఉన్నారు. ఈ విషయమై గ్రామస్తులు భిక్కనూరు పోలీసులకు ఫిర్యాదు చేశారు.

చికిత్స పొందుతూ ఒకరి మృతి

నాగిరెడ్డిపేట: మండలంలోని రాఘవపల్లికి చెందిన నార్ల నాగయ్య(55) శుక్రవారం ఉదయం ఎల్లారెడ్డి ఆస్పత్రిలో మృతిచెందాడు. ఈ నెల 17న రాత్రి నాగయ్య కత్తిగాట్లతో గాయపడిన విషయం తెలిసిందే. నాటి నుంచి ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న నాగయ్య శుక్రవారం మృతిచెందాడు. నాగయ్య మరణానికి గుండెపోటు కారణమని ఆస్పత్రి వైద్యులు ప్రాథమికంగా నిర్ధారించారని నాగిరెడ్డిపేట ఎస్సై రాజు తెలిపారు. నాగయ్య కత్తిగాట్లతో గాయపడిన ఘటనకు సంబంధించి నమోదు చేసిన కేసు విచారణ కొనసాగుతుందని,విచారణ తర్వాత కేసుకు సంబంధించిన పూర్తి వివరాలను వెల్లడిస్తామని పేర్కొన్నారు.

యువకుడి అదృశ్యం

ఎడపల్లి: మండలంలోని మంగళపాడ్‌కు చెందిన చిత్తారి సంతోష్ అదృశ్యమైనట్లు ఎస్సై వంశీకృష్ణరెడ్డి శుక్రవారం తెలిపారు. వివరాలిలా ఉన్నాయి. గ్రామానికి చెందిన సంతోష్ డ్రైవర్‌గా పని చేస్తున్నాడు. ఈనెల 17న పని ఉందని ఇంట్లో చెప్పి తిరిగి రాలేదు. కుటుంబీకులు పలుచోట్ల వెతికినా ఆచూకీ లభించలేదు. తల్లి పోశాని ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై పేర్కొన్నారు.

గుర్తు తెలియని మృతదేహం లభ్యం

మాక్లూర్: మండలంలోని అడవిమామిడిపల్లి ఊర చెరువులో గుర్తు తెలియని మృతదేహం శుక్రవారం లభ్యమైనట్లు ఎస్సై సుధీర్‌రావు పేర్కొన్నారు. సుమారు 35 ఏళ్ల యువకుడు నాలుగు రోజుల కితం చెరువులో పడి మృతి చెంది ఉంటాడని అనుమానం వ్యక్తం చేస్తున్నారు. మృతుడి ఆచూకీ వివరాలు ఎవరికైనా తెలిస్తే పోలీసులకు సమాచారం అందించాలని కోరారు.

ఆకుల కొండూర్‌లో..

నిజామాబాద్‌రూరల్: మండలంలోని ఆకుల కొండూర్‌లో గుర్తుతెలియని వృద్ధురాలి మృతదేహం లభ్యమైనట్లు రూరల్ ఎస్‌హెచ్‌వో మహేశ్ శుక్రవారం తెలిపారు. వివరాలిలా ఉన్నాయి. ఆకుల కొండూర్ గ్రామ ప్రయాణ ప్రాంగణంలో వృద్ధురాలు పడి ఉండడం చూసి అదే గ్రామానికి చెందిన చైర్మన్ అశోక్ పోలీసులకు సమాచారం అందించారు. సమాచారం అందుకున్న పోలీసులు ఘటన స్థలానికి చేరుకొని మృతదేహాన్ని పరిశీలించి జిల్లా ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. గుర్తు తెలియని మృతదేహంగా కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌హెచ్‌వో పేర్కొన్నారు. వృద్ధురాలి ఆచూకీ ఎవరికైనా తెలిస్తే పోలీసులకు సమాచారం అందించాలని కోరారు.

లాటరీ పేరిట సైబర్ మోసం

ఎల్లారెడ్డి: లాటరీ పేరిట సైబర్ మోసానికి గురైన ఘటన మండలంలోని మల్కాపూర్‌లో శుక్రవారం చోటు చేసుకుంది. ఎస్సై మహేశ్ తెలిపిన వివరాల ప్రకారం.. మండలంలోని మల్కాపూర్‌కు చెందిన లింగంపేట బాలకృష్ణకు గుర్తు తెలియని ఫోన్ నుంచి రూ. 5 లక్షల లాటరీ తగిలిందని దానిని పొందేందుకు కొంత డబ్బులను చెల్లించాలని సూచించడంతో బాలకృష్ణ పలు దఫాలకుగా రూ.38,805 చెల్లించగా ఇంకా చెల్లించాలని సూచించడంతో మోసపోయినట్లు గుర్తించి ఫిర్యాదు చేసినట్లు ఎస్సై తెలిపారు. కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై పేర్కొన్నారు.

మహిళ అదృశ్యం

కామరెడ్డి క్రైం: రోజు మాదిరిగా ఉదయాన్నే వాకింగ్‌కు వెళ్లిన ఓ మహిళ అదృశ్యమైనట్లు దేవునిపల్లి ఎస్సై రాజు తెలిపారు. వివరాలిలా ఉన్నాయి. జిల్లా కేంద్రంలోని దేవునిపల్లిలో ఉండే విద్యుత్‌నగర్ కాలనీకి చెందిన రేణుక శుక్రవారం ఉదయం 6 గంటల ప్రాంతంలో వాకింగ్‌కు వెళ్లి తిరిగి రాలేదు. కుటుంబీకులు పలు చోట్ల గాలించిన ఆచూకీ లభించలేదు. ఆమె చెల్లెలు నీరడి సరిత ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్సై పేర్కొన్నారు.

రాయితో కొట్టి హత్య

ఖలీల్‌వాడి: జిల్లా కేంద్రంలోని బోధన్ బస్టాండ్ ప్రాంతంలో శుక్రవారం ఉదయం ఇద్దరి మధ్య జరిగిన గొడవలో ఒకరు హత్యకు గురైనట్లు ఎస్‌హెచ్‌వో విజయ్‌బాబు తెలిపారు. వివరాలిలా ఉన్నాయి. ముస్తయిపురకు చెందిన సయ్యద్ అమీర్ షేక్, జన్నెపల్లి ఎక్స్‌రోడ్‌కు చెందిన మహబూబ్(30)కు పాత పరిచయం ఉంది. మృతుడికి అమీర్ షేక్‌కు నగదు విషయం గొడవ జరిగినట్లు సమాచారం. కాగా నిందితుడు వైట్‌నర్ మత్తు తీసుకోవడంతో కోపంలో మహబూబ్‌పై రాయితో దాడి చేసి హత్య చేసినట్లు తెలిపారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌హెచ్‌వో పేర్కొన్నారు.

ఫైనాన్స్ వేధింపులకు యువకుడి బలి

దోమకొండ: ఫైనాన్స్ సంస్థ వేధింపులకు ఓ యువకుడు బలయ్యాడు. ఇన్‌స్టాల్‌మెంట్ కట్టకపోవడంతో సంస్థ సిబ్బంది ఇంటికి వచ్చి బెదిరించడంతో ఆత్మహత్య చేసుకున్నాడు. వివరాలిలా ఉన్నాయి. దోమకొండ మండలంలోని అంచనూరు గ్రామానికి చెందిన చిన్నారం వంశీ(20) రెండేళ్ల క్రితం బైక్ కొనుగోలు చేశాడు. దానికోసం ఓ ఫైనాన్స్ సంస్థలో రూ. 75 వేలు రుణం తీసుకున్నాడు. రెండేళ్లుగా ప్రతినెలా ఈఎంఐ చెల్లిస్తున్నాడు. ఇంకా రూ. 15 వేల బాకీ ఉన్నాడు. ఇటీవల ఆర్థిక ఇబ్బందులతో ఈఎంఐ చెల్లించలేదు. దీంతో శుక్రవారం సదరు ఫైనాన్స్ కంపెనీ సిబ్బంది వంశీ ఇంటికి వెళ్లారు. ఆ సమయంలో వంశి ఇంట్లో లేకపోవడంతో బైక్ ఇన్‌స్టాల్‌మెంట్ డబ్బులు చెల్లించాలని కుటుంబ సభ్యులను అడిగారు. డబ్బులు కట్టకపోతే పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేస్తామని బెదిరించారు. ఈ విషయాన్ని వంశికి అతడి తల్లిదండ్రులు లక్ష్మి, దేవయ్య ఫోన్ ద్వారా తెలిపారు. దీంతో మనస్తాపం చెందిన వంశి గ్రామ శివారులోని ఎడ్లకట్ట వాగు వద్ద చెట్టుకు ఉరివేసుకుని ఆత్మహత్య చేసుకున్నాడు. మృతుడి కుటుంబ సభ్యులు ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకున్నామని దోమకొండ పోలీసులు తెలిపారు.



వంశి (ఫైల్)

పీడీఎస్ బియ్యం పట్టివేత



కామారెడ్డి క్రైం: జిల్లా కేంద్రంలోని రాజీవ్‌నగర్ కాలనీలో ఉన్న ఓ ఇంట్లో పీడీఎస్ బియ్యాన్ని అక్రమంగా నిల్వ ఉంచారనే సమాచారం రావడంతో టాస్క్‌ఫోర్స్ పోలీసులు శుక్రవారం దాడులు నిర్వహించారు. దాడుల్లో షేక్ అర్బాజ్ అనే వ్యక్తి తన ఇంట్లో 45 బస్తాల్లో పీడీఎస్ బియ్యాన్ని ఇతర ప్రాంతాలకు తరలించేందుకు సిద్ధంగా ఉంచినట్లు గుర్తించారు. వెంటనే నిల్వ ఉంచిన రేషన్ బియ్యాన్ని స్వాధీనం చేసుకుని సదరు వ్యక్తిపై కేసు నమోదు చేసినట్లు పట్టణ ఎస్‌హెచ్‌వో చంద్రశేఖర్‌రెడ్డి పేర్కొన్నారు.

హైటెక్ వ్యభిచారం గుట్టురట్టు

ఖలీల్‌వాడి: నగరంలోని సుభాష్‌నగర్ ప్రాంతంలో కొనసాగుతున్న హైటెక్ వ్యభిచారాన్ని గుట్టురట్టు చేసినట్లు సీఐ నరహరి, మూడో టౌన్ ఎస్సై ప్రవీణ్ కుమార్ తెలిపారు. సీపీ కల్మేశ్వర్ ఆదేశాల మేరకు అడిషనల్ డీసీపీ కోటేశ్వరరావు, ఏసీపీ రాజా వెంకటరెడ్డి ఆధ్వర్యంలో ఈ దాడి జరిగింది. వివరాలిలా ఉన్నాయి. సుభాష్‌నగర్ ప్రాంతంలోని ఓ ఇంట్లో వ్యభిచారం నిర్వహిస్తున్నట్లు సమాచారం అందడంతో సిబ్బందితో కలిసి దాడి చేయగా ఇద్దరు మహిళలు, ఒక విటుడు, వ్యభిచార నిర్వాహకురాలిని అదుపులోకి తీసుకొని కేసు నమోదు చేశారు. సుభాష్‌నగర్‌లో నిర్వాహకులు ఓ ఇంటిని అద్దెకు తీసుకొని కొంతమంది మహిళలకు డబ్బుల ఆశ చూపి వ్యభిచారం నిర్వహిస్తోందని పేర్కొన్నారు. దాడిలో ఏఎస్సై లీలాకృష్ణ, లక్ష్మీనారాయణ, కానిస్టేబుల్ రఘువర్ధన్, చామీంద్, గంగకుమార్, అబ్బులు, బాబులు పాల్గొన్నారు.